## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చంపాపేట:** విద్యుత్ సంబధ మరమ్మతు పనుల కారణంగా మాదన్నపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. చంపాపేట డివిజన్ దుర్గాభవానీనగర్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్‌ల పరిధిలో ఉదయం 7.30 నుంచి ఎనిమిది గంటల వరకు డీఎస్‌నగర్, సెంట్రల్ ఎక్సేంజ్, వినయ్‌నగర్, దుర్గాభవానీనగర్, యాదగిరినగర్, మారుతీనగర్, ఈస్ట్ మారుతీనగర్, ద్వారకానగర్, సుల్తానాఅల్వా కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

## రైతుబజార్లలో కూరగాయల ధరలు

**దిల్‌సుఖ్‌నగర్:** సరూర్‌నగర్,వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 15, వంకాయ 18, బెండ 40, పచ్చిమిర్చి 55, కాకర 35, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 21, క్యారెట్ 23. దొండ 28, ఆలు 27, ఉల్లి 22, గోకర 35, దోస 16, సొర 09, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 55, అర్వి 35, మునగ 28, చిలగడదుంప 65, బీట్‌రూట్ 23, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 50, కాప్సికమ్ 70. ఈధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి.

## భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**చంచల్‌గూడ:** సంకష్ట చతుర్థి సందర్భంగా కుర్మగూడ డివిజన్ ఇక్కల మఠం హనుమాన్ దేవాలయంలో శుక్రవారం గణపతి హోమం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు కష్ణమాచారి ఆధ్వర్యంలో దంపతులు హోమం నిర్వహించారు. అంతకుముందు తెల్లవారుజామున గణపతి విగ్రహానికి మహాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తును హోమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది. ప్రతి నెల సంకష్ట చతుర్థి రోజు క్రమం తప్పకుండా హోమం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. హోమానికి స్వయంగా హాజరుకలేని భక్తులు నెయ్యి, సమిధలు ఆలయంలో అందజేయవచ్చన్నారు.

## వాసవీక్లబ్ మన్సూరాబాద్ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం

**మన్సూరాబాద్:** వాసవీ క్లబ్ మన్సూరాబాద్ డివిజన్ నూతన సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం గురువారం రాత్రి డివిజన్ పరిధి సహారాస్టేట్స్‌కాలనీలోని శివాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీఎస్ గోల్డెన్ కేసీజీఎస్ గజ్జల రామకృష్ణ, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి, గవర్నర్ వీఎస్ గోల్డెన్ కేసీజీఎఫ్ నూరిశెట్టి నర్సింహ్మగుప్తాలు హాజరై నూతన అధ్యక్షులు మొరిశెట్టి సంతోష్‌కుమార్, సెక్రటరీ బూరెల్ల భాస్కర్, కోశాధికారి సరాబు అంజిబాబులచే ప్రమాణ స్వీకారం చేయించారు.

## సింగరేణి కాలనీలో యువతి అదృశ్యం

**సైదాబాద్:** కూరగాయల మార్కెట్‌కు వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగి రాని ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సింగరేణి కాలనీలో నివసించే రమావత్ సరియా ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతని రెండో కూతురు రమావత్ శైలజ(21) నర్స్‌గా పనిచేస్తుంది. గురువారం రాత్రి కాలనీలోని వారాంతపు సంతకు కూరగాయల కోసం వెళుతున్నాని చెప్పి ఆమె ఇంటి నుంచి వెళ్లింది. రాత్రి ఎంతకూ తను రాకపోవడంతో కుటుంబ సభ్యులు అంతటా వెతికారు. ఫలితం లేకపోవడంతో శుక్రవారం తండ్రి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## భర్త ఇంటి ఎదుట భార్య ధర్నా

**హస్తినాపురం:** తెలంగాణ రాష్ట్ర ఆర్‌టీసీ యూనియన్ నాయకుడు రాజిరెడ్డి ఇంటి ముందు ఆయన కోడలు పావని మహిళా సంఘాలతో కలిసి శుక్రవారం ధర్నా చేసింది. రాజిరెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి పెళ్లి గత సంవత్సరం మే 21న పావనితో జరిగిందని.. అయితే తనను కాపురానికి తీసుకెళ్లలేదని వాపోయింది. అత్తగారింటికి వస్తే ఇంట్లోకి అనుమతించకుండా ఇంటికి తాళం వేసుకుని వెళ్లిపోయారని ఆరోపించింది. పెళ్లి సమయంలో తనకు తన తల్లి పెట్టిన బంగారు ఆభరణాలను తీసుకొని ఇవ్వడంలేదని పావని ఆరోపించారు. తన మామ రాజిరెడ్డి తనకు ఎమ్మెల్యేలు, మంత్రుల అండదండలు ఉన్నాయని బెదిరింపులకు పాల్పడుతున్నాడని పావని ఆరోపించారు. ఈ విషయంపై రాజిరెడ్డి మాట్లాడుతూ..కోడలికి చర్మ సంబంధ వ్యాధి ఉందని తమకు ఎలాంటి కట్నం ఇవ్వలేదని చర్మవ్యాధి ఉన్న విషయం చెప్పకుండా దాచిపెట్టి పెళ్లి చేయడంతోనే సమస్యలు వస్తున్నాయన్నారు. తాము న్యాయపరంగానే సమస్యను పరిష్కరించుకుంటామని అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**చైతన్యపురి:** వాటర్ ట్యాంకర్‌ను ఓవర్ టేక్ చేయబోయి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. చంపాపేటకు చెందిన నందిగామ ప్రకాష్ (37) జీహెచ్‌ఎంసీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం నాగోల్ నుంచి బైక్‌పై ఉప్పల్ వెళుతున్నాడు. అదే సమయంలో వాటర్ ట్యాంకర్‌ను ఓవర్ టేక్ చేస్తుండగా మరో ద్విచక్రవాహన దారుడు ఓవర్ టేక్ చేసుకుంటూ ప్రకాష్ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో వాటర్ ట్యాంకర్ చక్రాల క్రింద పడి తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్ మార్టంకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం హెచ్‌కె ప్రసాద్ తెలిపారు.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం




**ఉప్పల్:** ఉప్పల్ మినీ శిల్పారామంలో శుక్రవారం సెలవు దినం కావడంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి సంగీత నృత్యానికేతన్ గురువు యచ్యుతాంబ శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. రంగపూజ, మూషిక వాహన, గణేశాస్తుతి, రామాయణ శబ్దం, మోహిని భస్మాసుర, స్వాగతం కృష్ణ అంశాలను వైష్ణవి, నవ్య, శ్రేయ, అనఘా, చిన్మయి, గౌతమి, ప్రాంజల్‌లు ప్రదర్శించి మెప్పించారు.

# మిగిలింది రెండు రోజులే..!

- ఇప్పటి వరకు వసూళ్లు అయినవి రూ. 244.59కోట్లు
- మరో రూ.76.03కోట్ల వసూళ్ల కోసం ప్రయత్నం
- టార్గెట్లను పూర్తిచేస్తాం: జడ్‌సీ ముకుందరెడ్డి

**ఎల్‌బీనగర్:** మరో రెండు రోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం గడువు ముగియనుండటంతో ఆస్తి పన్నుల వసూళ్ల జోరుగా సాగుతోంది. ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో ఆస్తి పన్నుల చెల్లింపు గడువు ఈ నెల 31తో ముగియనుంది. ఆస్తి పన్నుల టార్గెట్లను పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది ఉరుకులు పరుగులు పెడుతున్నారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం వసూళ్ల రెట్టింపు చేసేందుకు అధికారులు కుస్తీలు పడుతున్నారు.ఎన్నికల వేళలో ఒక వైపు ఎన్నికల విధులు, మరో వైపు ఆస్తి పన్ను వసూళ్లపై అధికారులు మల్లాగుల్లాలు పడుతున్నారు. గత సంవత్సరం టార్గెట్‌ను పూర్తి చేస్తారో లేదో అని అధికారుల్లో సందేహం వ్యక్తం అవుతోంది.

### సర్కిళ్ల వారీగా వసూళ్లు ఇలా ..

ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో ఐదు సర్కిళ్ల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరం రూ.320కోట్లు ఉండగా ఇప్పటి వరకు సుమారుగా రూ. 244.59కోట్లు వసూళ్ల చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇక ఆస్తి పన్నులు చెల్లించే గడువు ఈ నెల 31న ముగిస్తుంది. చివరి రోజు వరకు ఇచ్చిన టార్గెట్‌ను చేరుకుంటామని ధీమాలో అధికారులు ఉన్నారు.

### రేపటితో ఆస్తి పన్ను చెల్లింపు గడువు ఆఖరు



అధికారులతో ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయం జోనల్ కమిషనర్ ముకుందరెడ్డి సమీక్షా నిర్వహిస్తున్న దృశ్యం

- కాప్రా సర్కిల్‌లో రూ.65.63కోట్ల టార్గెట్ ఉండా ఇప్పటి వరకు సుమారుగా 53.26 కోట్లు వసూలు అయింది. మిగిలిన రూ.12.36కోట్ల ఆస్తి పన్నులు రాబట్టేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు,
- ఉప్పల్ సర్కిల్‌లో రూ.43.10కోట్లు ఆస్తి పన్నులు వసూలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు సుమారుగా రూ. 33.59కోట్ల మేరకు ఆస్తి పన్ను వసూలు అయింది, మిగిలిన రూ. 9.44కోట్ల ఆస్తి పన్ను వసూలు చేసేందుకు అధికాలు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు.
- ఎల్‌బీనగర్ సర్కిల్–3లో రూ.74కోట్లుగాను ఇప్పటి వరకు రూ. 65.18కోట్లు వసూలు అయింది.మరో రూ. 8.84కోట్ల ఆస్తి పన్ను వసూలు చేసేందుకు అధికారులు నోటీసులు జారీ చేశారు.
- ఎల్‌బీనగర్ సర్కిల్–4లో రూ.62.56కోట్లు టార్గెట్ ఉండగా ఇప్పటి వరకు రూ. 43.27కోట్లు వసూలు అయింది. మరో రూ. 19.26కోట్లను కాబట్టేందుకు అధికారులు వాట్సాప్ మేసేజ్‌లు, ఇంటింటికి తిరుగుతూ టార్గెట్‌ను పూర్తి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.
- ఎల్‌బీనగర్ సర్కిల్–5లో రూ. 75.63కోట్లు కాగా ఇప్పటి వరకు రూ. 49.29కోట్లు వసూళ్లు చేశారు. ఇక మిగిలిన రూ. 26.13కోట్లను వసూలు చేసి తమ టార్గెట్‌ను పూర్తి చేయాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.
- ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని ఐదు సర్కిళ్ల పరిధిలో సుమారుగా రూ. 76.03కోట్లు వసూళ్ల చేస్తే ఈ సంవత్సరం టార్గెట్ పూర్తి అయినట్లే అని అధికారులు పేర్కొంటున్నారు.

### ఇంకా రూ.76.03 కోట్లు రావాలి..

మరో రెండు రోజుల్లో రూ.76.03 కోట్ల మేరకు వసూళ్ల చేస్తే ఈ ఆర్థిక సంవత్సరం అనుకున్న లక్ష్యాలను పూర్తి చేసినట్లేనని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికీ సుమారుగా ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో ఆస్తి పన్నులు రూ, 244.59 కోట్ల ఆస్తి పన్నులను వసూళ్లు చేశారు. గత సంవత్సరంలో గ్రేటర్‌లోని అన్ని జోన్లలో ఎల్‌బీనగర్ జోన్ ఆస్తి పన్ను వసూల్లో మొదటి స్థానం కోసం ప్రయత్నం చేస్తున్నట్లు జోనల్ కమిషనర్ పేర్కొన్నారు.

### టార్గెట్‌లను పూర్తి చేస్తాం:

ఈ ఆర్థిక సంవత్సరం ఇచ్చిన టార్గెట్‌లను పూర్తి చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని జోనల్ కమిషనర్ ముకుందరెడ్డి తెలిపారు. ఇందుకు గాను ఐదు సర్కిళ్ల డీసీలు, రెవిన్యూవిభాగం అధికారులు, సిబ్బంది కూడా ఆస్తి పన్నులు వసూళ్లలో ఇచ్చిన టార్గెట్లను పూర్తి చేసేందుకు ముమ్మరంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇక మిగిలింది మరోరెండు రోజు గడువు మాత్రమేనని, బకాయిదారులు వెంటనే మీ సేవాల్లోగాని, టాక్స్ వసూళ్ల కేంద్రాల్లోగాని, సిటిజన్ సర్వీస్ సెంటర్లవద్దగాని చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

– జడ్‌సీ ముకుందరెడ్డి

## కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం

జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్

**సైదాబాద్:** కాంగ్రెస్ పార్టీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆకుల రాజేశ్వర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన సంఘం ప్రతినిధులతో కలిసి సికింద్రాబాద్ ఎంపీ స్థానం కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం ఆయన సైదాబాద్‌లో మాట్లాడుతూ, రానున్న ఎంపీ ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు తమ జాతీయ బీసీ సంఘం మద్దతు తెలుపుతుందని ప్రకటించారు. కులగణన ప్రక్రియ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం జీఓ జారీ చేయడం ద్వారా బీసీలపై తమకున్న చిత్తశుద్ధిని చాటుకుందన్నారు.

## కెమికల్ వ్యర్థాలు రాకుండా చర్యలు తీసుకోండి

**ఉప్పల్:** ఉప్పల్ డివిజన్ పరిధిలోని పారిశ్రామికవాడ శ్రీరమణపురంలో స్థానిక సమస్యలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించారు. స్థానికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. కొద్ది రోజులుగా ఉప్పల్ పారిశ్రామికవాడ నుంచి వచ్చే కెమికల్ వ్యర్థాలు పైపులైన్ పగిలి కాలనీల్లోకి వస్తున్నాయని, దీనివల్ల స్థానికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి అధికారులతో మాట్లాడారు. త్వరలో కెమికల్ వ్యర్థాలు రాకుండా అన్ని చర్యలు తీసుకోనున్నట్లు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సత్వరమే స్పందించడంతో కాలనీ జనరల్ సెక్రటరీ జి.బి. సాయి, రత్నాకర్, కాలనీ గౌరవ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## ఓటర్లను చైతన్యం చేస్తున్నాం

డీసీ జయంత్



**చాదర్‌ఘాట్:** ఓటరు నమోదుకు ఇంకా అవకాశం ఉందని వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతున్న నేపథ్యంలో అర్హులైన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయించే క్రమంలో ఓటర్లను చైతన్యం చేస్తున్నామని మలక్‌పేట సర్కిల్–6 ఎన్నికల అధికారి జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం మలక్‌పేటలోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుందని తెలిపారు. మే 13న పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియకు ముందు వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన వారిని అందరినీ చేర్చే క్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులతో పాటు, బీఎల్‌ఓలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు, కాలనీ సంక్షేమ సంఘాలు, బస్తీ సంఘాలను ముందు చైతన్యం చేస్తున్నామని తెలిపారు. వచ్చే నెల వరకు 18 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే విడుదల అయిన తుదిజాబితాకు వారందరి పేర్లు అదనపు జాబితాలో నమోదు అవుతున్నాయని తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆరా తీస్తున్నామని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే సర్కిల్ కార్యాలయానికి వచ్చి సమస్యను నివృత్తి చేసుకోవాలని తెలిపారు.

## 'పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తా'



వరదనీటి కాలువ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహ్మారెడ్డి

**మన్సూరాబాద్:** దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారిగా పరిష్కరిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి స్పష్టంచేశారు. డివిజన్ పరిధిలోని ఆగమయ్యనగర్ కాలనీలోని జరుగుతున్న వరదనీటికాలువపైపులైన్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాకాలంలో మురుగునీరు, వరదనీరు కలిసి ప్రవహిస్తుండటంతో గణేష్‌నగర్, సాయినాథ్ కాలనీ, మల్లీఖార్జుననగర్‌కాలనీవాసులు ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉందని, దీర్ఘకాలిక సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు అభివృద్ధికి సహకరిస్తే పనులు వేగవంతంగా పూర్తి అవుతాయన్నారు. కాలనీవాసులు వెంకటేష్ , వెంకట్‌రెడ్డి, ఆనందం, నరేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, మల్లేష్‌యాదవ్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

## ఖాసీం అలీకి డాక్టరేట్

**రామంతాపూర్:** నగరంలోని నవాబ్ షా అలంఖాన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీలో గణితం బోధించే రామంతాపూర్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాసీం అలీకి జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ( జేఎన్‌టీయూ హెచ్) గణిత శాస్త్రంలో డాక్టరేట్ ప్రకటించింది. ప్రొఫెసర్ డాక్టర్ వై.రాజశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పత్రాన్ని సమర్పించినందుకు జేఎన్‌టీయూ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ ఇన్ మ్యా మెటిక్స్ అవార్డును ఆయనకు శుక్రవారం అందజేశారు. పలువురు అధ్యాపకులు అభినందించారు.

## సీఎం రేవంత్‌రెడ్డి కలిసిన పార్టీ సేవా దళ్ నాయకులు..



**నాగోలు:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎల్‌బీనగర్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ సేవా దళ్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ షరీష్ శుక్రవారం మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా ఎండీ షరీష్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునిత మహేందర్‌రెడ్డి గెలుపుకోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పార్లమెంట్ స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కాంగ్రెస్ పార్టీ సేవా దళ్ కార్యకర్తలు, నాయకులు పనిచేస్తారని తెలిపారు.

## బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం



వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**మన్సూరాబాద్:** బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతు పలికి భారీ మెజార్టీతో గెలుపించుకుందామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టంచేశారు. హరిణి వనస్థలి జాతీయ పార్కు మన్సూరాబాద్ గేట్ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఎమ్మెల్యే శుక్రవారం మార్నింగ్‌వాక్‌లో వాకర్స్‌ను కలిసి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో యోగా షెడ్‌ను ఏర్పాటు చేశామని, యోగా షెడ్‌ను వెడల్పు చేస్తానని, ఓపెన్ జీమ్‌ను ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని పార్కుల్లో ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, నాయకులు చెరకు ప్రశాంత్‌గౌడ్, అనంతుల రాజిరెడ్డి పాల్గొన్నారు.

## 31న ఎస్‌కే గార్డెన్స్‌లో క్రీస్తు పునరుత్థాన ఆరాధన



సమావేశంలో క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు..

**నాగోలు:** సకల మానవాళి పాపపరిహారార్థం ప్రభువైన యేసుక్రీస్తు మరణించి పునరుత్థానుడై మరణం జయించి లేచిన రోజు క్రైస్తవ భక్తి, విశ్వాసం, నిరీక్షణకు ఆధారమని ఎల్‌బీనగర్ నియోజకవర్గం క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యం.దేవానంద్ అన్నారు. శుక్రవారం కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లో సెయింట్ మాథ్యుస్ ఫుల్ గోస్పెల్ మినిస్ట్రీస్ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 31న ఆదివారం తెల్లవారు జామున క్రీస్తు సమాధినుండి సజీవంగా లేచారని అట్టి పర్వదినం సందర్భంగా ఎల్‌బీనగర్ యస్.కె.గార్డెన్స్ ఫంక్షన్ హాలులో ఉదయం 4.30 లకు క్రీస్తు పునరుత్థాన ఆరాధన (సూర్యోదయ ఆరాధన) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.



# భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



వనస్థలిపురం లిటిల్ ల్యాంబ్ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న క్రిస్టియన్లు



దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చిలో.. ప్రాసర్లు బోద సాల్మన్, శాంతన్‌కుమార్

**వనస్థలిపురం:** గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం వనస్థలిపురంలోని లిటిల్ ల్యాంబ్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పెద్దలు, పాస్టర్ రెవ. డా.కే.సుదర్శన్‌రావు ఏసుక్రీస్తు సిలువపై పలికిన చివరి ఏడు మాటలను వినిపించారు. జీసస్ బోధించిన ప్రేమ, కరుణ, క్షమాగుణాల నుంచి స్ఫూర్తి పొంది మన దైనందిన జీవితంలో ముందుకు సాగాలని కోరారు. అనంతరం ప్రార్థనా గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో చర్చి కమిటీ ప్రతినిధులు టీ.ఎస్.బాబూరావు, జార్జిముల్లర్, భానుకిరణ్, ఎన్.జాన్, సురేష్‌కుమార్, రఘురాం, జాకబ్ ప్రసాద్, విజయలక్ష్మి లాజరస్, వందలాది మంది సభ్యులు పాల్గొన్నారు.



స్తుతి గీతాలు ఆలపిస్తున్న క్వాయర్ టీమ్

**దిల్‌సుఖ్‌నగర్:** గుడ్‌ఫ్రైడే వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మలక్‌పేట్‌జోన్ పరిధిలోని ఆర్‌కేపురం, దిల్‌సుఖ్‌నగర్, మూసారంబాగ్, అక్బర్‌బాగ్ చర్చిల్లో, సైదాబాద్, ఐఎస్‌సదన్, సరూర్‌నగర్ తదితర ప్రాంతాలలో వేడుకలు జరిగాయి.



బేతనియ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ సామ్యేల్ బాబు బైరపోగు

## సూర్యప్రతాపం

- రోజురోజుకూ పెరుగుతున్న ఎండలు
- మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా రహదారులు

**చైతన్యపురి:** రోజు రోజుకూ భానుడు ప్రతాపం చూపిస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఎండవేడికి విలవిల్లాడుతున్నారు. ఎల్‌బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, వనస్థలిపురం, హయత్‌నగర్, నాగోలు ప్రాంతాల్లో మధ్యాహ్నం వేళ జనసంచారం, వాహనాల రాకపోకలు లేకపోవటంతో రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే ఎల్‌బీనగర్ , నాగోలు షైఓవర్లు మధ్యాహ్నం సమయంలో వాహనాల రాకపోకలు తక్కువగా దర్శనం ఇచ్చాయి. మూడు రోజుల నుంచి మరీ ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఇండ్లలో నుంచి బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. తప్పని పరిస్థితిలో తప్ప ఎవరూ కూడా మధ్యాహ్నం వేళ అధిక శాతం మంది ఇండ్లకే పరిమితం అవుతున్నారు. మార్చి చివరిలోనే ఇంతగా ఎండలు ఉంటే ఏప్రిల్, మే నెలలో మరింత ఉష్ణోగ్రతలు పెరిగి ఎన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందో అని అనుకుంటున్నారు.

**శీతల పానీయాలు, పండ్ల రసాలకు పెరిగిన డిమాండ్**

ఎండ వేడికి తట్టుకోలేక జనం శీతల పానీయాలు, పండ్ల రసాలతో సేద తీరుతున్నారు. వేసవి తాపం తీర్చుకోవటానికి సాయంత్రం వేళల్లో ఏప్రాంతంలో చూసినా పండ్ల రసాలు, నిమ్మకాయ షోడా, ఐస్‌క్రీం పార్లర్‌ల వద్ద క్యూ కడుతున్నారు. అంతే కాక కొబ్బరి బోండాలు, లస్సీ వంటి పానీయాలకు కూడా డిమాండ్ పెరిగింది.



ఎల్‌బీనగర్ నుంచి బైరామల్‌గూడ వెళ్లే రహదారి..

**తాటిముంజలకు భలే డిమాండ్**

వేసవిలో అందుబాటులో ఉండే తాటి ముంజలకు మంచి డిమాండ్ వుంది. నల్గొండ, సూర్యాపేట, వరంగల్ ప్రాంతాల నుంచి తాటి ముంజలను తీసుకొచ్చి కొందరు ఎల్‌బీనగర్, కొత్తపేట, హయత్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, నాగోలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌పై పెట్టి విక్రయిస్తున్నారు. వేసవి తాపానికి తాటి ముంజలు చక్కగా పని చేస్తుండటంతో రేటు కొంత ఎక్కువైనా వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. డజన్ తాటి ముంజలు రూ. 120 వరకు ధర పలుకుతుంది. అంతే కాక వేసవిలో పుచ్చకాయలను, మంచి డిమాండ్ వుంది. ధర కూడా తక్కువగా వుండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు పుచ్చకాయలను తీసుకోవటానికి ఇష్టపడుతుంటారు.